మూడు ..... నాలుగు .....

నాలుగ్గంటలకు రిటైరింగ్ రూంలోంచి బయటకొచ్చి కేంటీన్ ముందు టీ తాగుతూ నిలబడ్డాడు.

తెల్లవారితే తనెక్కడకు వెళతాడు ..... ?

బంగారు పంజరలో వున్నంతకాలం ఆ బతుకు వేరు-- మనిషి రోడ్డుమీద పడ్డాకే, ఒకదాని తర్వాత ఒక అనుభవం ఎదురవుతుంది. దేన్నయినా సహించాలి అన్న అనుభవం వచ్చాకే మనిషి రాటుదేలతాడు. తండ్రి చాటున, కోటీశ్వరుడి కొడుగ్గా బతికినప్పుడు కనిపించిన ప్రపంచానికి, ఇప్పుడు కనిపిస్తున్న ప్రపంచానికీ అసలు పోలికే కాదు.

నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ వస్తున్నట్టు, స్పీకర్‌లోంచి ఎనౌన్స్‌మెంట్ విన్పించగానే స్టేషన్ సందడిగా తయారయింది.

" మధుకర్ ..... "

హిగ్గిన్ బాదమ్స్ దగ్గర ఈనాడు పేపర్ తీసుకుని చూస్తున్న మధుకర్ ఆ పిలుపు విని ఒక్కసారి తలెత్తాడు.

ఎదురుగా రవికిరణ్ . అప్పుడే ట్రైన్లోంచి దిగాడాయన.

"అర్జంటుగా వూరెళ్ళి వస్తున్నాను. నువ్వేటు వెళ్తున్నావ్" దగ్గరకొచ్చి భుజమ్మీద చెయ్యివేస్తూ అడిగాడు రవికిరణ్ .

"నేనా ..... ఒక ఫ్రెండ్‌కి సెండాఫ్ యివ్వడానికి వచ్చాను ..... " తత్తరపాటుకి గురవుతూ అన్నాడు.

"రా వెళ్దాం" అలా అంటున్న రవికిరణ్ ముఖంలోకి చూశాడు.

“నువ్వు మీ ఇంటికెళ్ళడానికి రూల్స్ ఒప్పుకోవు కానీ ..... మా ఇంటికెళ్ళడానికేం, పర్వాలేదు ..... మీ డాడీకి నేనేం చెప్పనులే .....”

ఇద్దరూ బయటికొచ్చి ఆటో ఎక్కారు.

“ఫ్రెండ్స్ దగ్గర ఉండడానికి మొహమాటపడి, రైల్వేస్టేషన్ కొచ్చావు కదూ ...” ఆ మాటకు సిగ్గుతో చితికిపోయాడు. మనసు అంతరాల్లో ఏదో దు:ఖం.

రవికిరణ్ తన చెమర్చిన కళ్ళను, మధుకర్‌కు కనబడకుండా తుడుచుకున్నాడు.

ఓ ఇరవై నిముషాల తర్వాత ఆటో రవికిరణ్ ఇంటి ముందు ఆగింది.

కాలింగ్ బెల్ కొట్టగానే , పనిమనిషి వచ్చి తలుపు తీసింది. మధుకర్ కి ఓ గదిని చూపించి, “గో టు బెడ్ ..... నువ్వు లేచేవరకూ నేనుంటాను ..... ” మధుకర్ ఆ గదిలోకి వెళ్ళగానే , తన బెడ్‌రూంవేపు దారి తీసాడు రవికిరణ్ .

భర్త మాటలు వినబడడంతో నిద్రపోతున్న హేమలతకు గబుక్కున మెలుకువ వచ్చింది.

బెడ్‌రూంలోకి రాబోతున్న భర్తకు ఎదురుగా వెళ్ళి--

“ఇదేనా రాక ..... ఓ గంటసేపు హాల్లోనే పడుకోండి. మీరు ఇవాళ వస్తారో ..... రేపొస్తారో తెలీదు కదా ..... నాకు తోడుగా మా ఫ్రెండ్ వచ్చి పడుకుంది ..... ”

“ఒకే ..... నేను హాల్లో పడుకుంటాను గానీ ..... స్టేషన్‌లో మధుకర్ కనబడితే ఇంటికి తీసుకొచ్చాను. గెస్ట్ రూంలో పడుకున్నాడు. డిస్టర్బ్ చెయ్యక” అని చెప్పి, హాల్లో సోఫా మీద ముసుగు తన్నేశాడు రవికిరణ్ .

అప్పటికే తెల్లవారడానికి ఇంకో గంట మాత్రమే టైముంది.

* * * *

“గుడ్ మార్నింగ్ ..... ” స్నానం చేసి, వంట గదిలో కొస్తున్న మహతికి విష్ చేసింది హేమలత.

మధుకర్ అక్కడే ఉన్నాడని చెప్పాలా? వద్దా? అని చాలా సేపు తర్జన భర్జన పడి, ఏం చెబితే ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆ విషయం చెప్పలేదు హేమలత.

“రాత్రి బాగా టైర్ అయిపోయి ఇంటికొచ్చావని చెప్పలేదు. నాకు ఓ పెద్ద టైలరింగ్ షాప్‌లో చిన్న ఉద్యోగం దొరికింది. ఇవాళే జాయిన్ కావాలి. అలాగే ఆ దగ్గరలోనే ఓ చిన్న రూం చూసుకుంటాను” చెప్పింది మహతి.

“ఇప్పుడిప్పుడే రూం తొందరేంటి ..... నర్సింగ్‌హోంలో ఉండొచ్చు కదా ..... అప్పుడప్పుడు మీ అన్నయ్యగారు వూళ్ళో లేనప్పుడు ఇలాగే నాకు ఇంట్లో తోడుంటావు కదా ..... ” అంది హేమలత -- మహతి ఒంటరిగా ఉండటం ఇష్టంలేక.

“రూం తీసుకోవడం ..... నేను రోడ్డుమీద లేను ..... అన్న నా శాటిస్‌ఫేక్షన్ కోసమే హేమా ..... నువ్వు వద్దన్నా, రోజూ వచ్చేస్తాను ..... ” నవ్వుతూ హేమలత అందించిన కాఫీ తీసుకుంటూ అంది మహతి.

ఒక్కసారి మహతి కాళ్ళవేపు చూసింది హేమలత .

“మహతీ ..... లాస్ట్ అండ్ ఫైనల్‌గా అడుగుతున్నాను. నీ నిర్ణయం మార్చుకోవా ..... ”

“లేదు హేమా ..... వీ డిజర్వ్ ఏ బ్రేక్ ..... ఇట్ షుడ్ బి పాజిటివ్ ఏఛివ్‌మెంట్ ..... నాకా నమ్మకం ఉంది. లైఫ్ ఓ పదివేల మంది చుస్తుండగా, పదమూడు మంది ఆడే క్రికెట్ కాదు -- గెలుపోటముల రియాక్షన్ వెంటనే తెలియడానికి ప్లీజ్ డోంట్ డిస్ కరేజ్‌మీ.”

సీరియస్‌గా అంటున్న మహతి మాటలకు మరేం మాట్లాడలేదు హేమలత .

మరో పావుగంట తర్వాత ఆ ఇంట్లోంచి బయటకొచ్చింది మహతి. మహతి బయటకొచ్చిన అయిదునిముషాల తర్వాత తన గదిలోంచి బయటికొచ్చాడు మధుకర్ .

అతను సడన్‌గా మేల్కొని బయటకు రావడానికి గల కారణం మగతనిద్రలో అతనికి మహతి మాటలు వినిపించడమే. అది కలో, నిజమో అర్థంకాలేదు. నిజమైతే ఎంత బావుండు! అనుకుంటూ బయటకొచ్చాడు.

మహతి ఇక్కడికెందుకొస్తుంది? అన్న ప్రశ్న తలెత్తగానే అంతవరకూ ఉన్న ఉత్సాహం మొత్తం చల్లారిపోయింది.

అవును. మహతి ఇక్కడకు ఎందుకొస్తుంది.

రవికిరణ్, మధుకర్‌ని హేమలతకు పరిచయం చేశాడు. మధుకర్ అంటే ఏదో అసహ్యాన్ని పెంచుకుంది హేమలత .

మధుకర్ అంటే పరమ దుర్మార్గుడు అని ఆమె అభిప్రాయం. కొన్నాళ్ళ క్రితం వరకూ మధుకర్ గురించి ఏం చెప్పినా, ఆసక్తిగా వినే తన భార్య మధుకర్ స్వయంగా ఇంటికి వచ్చినా, ఎందుకు పట్టించుకోలేదో, ఎందుకు అనాసక్తిగా వుందో అర్థంకాలేదు. టిఫిన్ చేస్తున్న సమయంలో --

మరోసారి చెప్పి చూసాడు రవికిరణ్ .

మధుకర్ అభిప్రాయంలో ఏం మార్పు లేదు.

పోనీ --

"నీ కేదైనా రూం దొరికేవరకూ, ఓ రెండ్రోజులు మా ఇంట్లో వుండు. దీన్ని మాత్రం కాదనకు. నేను మీ నాన్నగారికి చెప్పనులే" వాగ్దానం చేసాడు రవికిరణ్ .

"రెండ్రోజులంటే ..... రెండ్రోజులే" మధుకర్ అన్నాడు నవ్వుతూ. హాస్టల్లో వున్న సూట్‌కేస్‌ను తెచ్చుకోడానికి బయలుదేరాడు.

********

హాస్టల్‌లోని రూమ్ దగ్గరకు మధుకర్ వెళ్ళేసరికి మూర్తి, విజయ్ సహజంగానే హస్కు కొడుతూ నించున్నారు.

“రాత్రి ఏమైపోయావురా మహానుభావా ..... నీ కోసం ఎదురుచూసి, చూసి కళ్ళు కర్భూజాలై పోయాయి--” జోకు వేశాడు మూర్తి.

ఆ జోక్‌ని పట్టించుకోకుండా లోనికి వెళ్ళి తన సూట్‌కేస్‌ను తీసుకొని బయటికొస్తూ--

“థాంక్స్‌రా మూర్తీ, నాకో రూం దొరికింది ..” మధుకర్ నోటెంట అలాంటి మాట వస్తుందని ఊహించని మూర్తి, విజయ్ ప్రపంచ అద్భుతం ఏదో జరిగిపోయినట్టు చూశారు.

“ఏం ..... రా ..... ఇక్కడుండొచ్చు కదా ..... ” నీళ్ళు నములుతూ అన్నాడు మూర్తి.

“ఎక్కడుంటావ్ ..... ఏం చేస్తావ్ ..... ” విజయ్ అడిగాడు.

“నా కాళ్ళమీద నేను నిలబడాలని బతకాలని వచ్చేసాను. మళ్ళీ మీ కాళ్ళమీద నేను నిలబడడం బాగోదు” నవ్వుతూ అనేసి గబగబా మెట్లు దిగి వెళ్ళిపోయాడు మధుకర్ .

వెళ్ళిపోతున్న మధుకర్ వేపు చూస్తూ--

“రాత్రి వాడి గురించి మనం మాట్లాడుకుంటున్నప్పుడు వచ్చుంటాడు. నో డౌట్ ..... వాడి ముఖం చూశారా? ఏదో ఫీలౌతున్నట్టుగా లేదూ ..... ” విజయ్ అన్నాడు.

మూర్తి మాట్లాడలేదు ..... ఒకింత గిల్టీగా ఫీలయ్యాడు.

* * * *

స్టిచ్ వెల్ టైలరింగ్ షాపులోకి ఉదయం టంచన్‌గా తొమ్మిది గంటలకు అడుగుపెట్టింది మహతి.

అప్పటికింకా ఎవరూ రాలేదు.

ప్రొప్రయిటర్ వనజాక్షి "రా అమ్మా" అంటూ నవ్వుతూ పలకరించింది.

సింగర్ ఎలక్ట్రిక్ మిషన్ దగ్గరకు తీసికెళ్ళింది.

"ఇవాల్టినుంచి నీ పని లేటెస్ట్ మోడల్స్‌కు డిజైన్ చెయ్యడం, కుట్టడం ..... మన డిజైన్స్ చూసి రైవల్ గ్రూప్స్ అదిరిపోవాలి...... క్లాత్‌ను కొన్ని డిజైనింగ్ బుక్స్‌నూ మహతికి అందిస్తూ అంది వనజాక్షి.

** ** ** **

ఇందిరా పార్కులో ఓ గంటసేపు, అక్కడినుంచి టాంక్‌బండ్ మీద విగ్రహాల్ని చూస్తూ ఓ నలభై నిముషాల సేపు గడిపి, లిబర్టీ చౌరస్తాలో ఇరానీ రెస్టారెంట్‌లో కూర్చున్నాడు.

టీ తాగుతున్నప్పుడు మహతి గుర్తుకొచ్చింది.

మహతి ఎలా ఉంది- ఎక్కడ ఉంది ..... మహతిని కలవడం ఎలా ..... ఎలా .....

లేడీస్ హాస్టల్‌లో ఉంటోందేమో ..... సుధారాణిని కల్సుకుంటే తెలుస్తుంది. సుధారాణికి ఫోన్ చేస్తే, వెంటనే రెస్టారెంట్ కౌంటర్‌లో డైరక్టరీ తీసుకుని, హాస్టల్‌లో నెంబర్ చూసి ఫోన్ చేశాడు.

లైన్‌లోకొచ్చింది సుధారాణి .

మధుకర్ తనకు ఫోన్ చెయ్యడం- కలా నిజమా తుళ్ళుతూ, పడుతూ ఫోన్ రిసీవర్ అందుకుంది.

"హలో ..... సుధా హియర్ ..... "

"సుధా ..... నేను మధుకర్‌ని ..... మహతి కల్సిందా ..... "

"మహతి లేదు కదా ..... కాలేజీకి రావడం లేదు కదా. డిస్ కంటిన్యూ చేసిందంటున్నారు"

“సుధా నాకో చిన్న హెల్ప్ చేస్తావా. మహతి వేర్ ఏబౌట్స్ ఎంక్వయిరీ చేస్తావా ..... రేపు ఇదే టైమ్‌కి ఫోన్ చేస్తాను ..... ”

“అది కాదు ..... మధుకర్ ..... రేపు మీరెక్కడుంటారో చెప్పండి. నేనే వచ్చి కలుస్తాను ..... ” ఆ రోజు చెంపదెబ్బ కొట్టిన దగ్గర్నుంచి మధుకర్ అంటే ఇంకా పిచ్చి ప్రేమ పెరిగింది సుధారాణిలో. అందుకే ఈ అవకాశాన్ని వదులుకోదలచుకోలేదు.

“శంకరమఠం ..... హోటల్ సత్కార్ లో వుంటాను ..... వస్తావా ..... ” చెప్పాడు మధుకర్ .

“విత్ ప్లజర్ ..... సీ యూ ..... ” రిసీవర్ పెట్టేసి ..... రూంలోకెళ్ళి, టెలిఫోన్ నెంబర్లను నోట్ చేసుకున్న చిన్న బుక్‌ని తెచ్చుకుని మహతి ఫ్రెండ్సందరకీ ఫోన్ చేసింది సుధారాణి .

ఇరానీ రెస్టారెంట్లోంచి బయటికొచ్చాడు మధుకర్ .

“హలో మధూ ..... ” ఆ పిలుపు వినబడగానే దూరం నుంచి విష్ చేసిన ఆ వ్యక్తివేపు చూశాడు మధుకర్ .

స్కూటర్‌ని పక్కకుతిప్పి, మధుకర్ దగ్గరకొచ్చి ఆగాడు అశోక్‌కుమార్.

అశోక్ కుమార్ ఇంటర్‌మీడియేట్ వరకూ అతనితో చదివిన క్లాస్‌మేట్ ..... వాళ్ళ నాన్నకు ఆఫ్‌సెట్ ప్రెస్ వుండేది. ఒకప్పుడది బాగా నడిచేది. రాను, రానూ ట్విన్ సిటీస్‌లో ఆఫ్‌సెట్ ప్రెస్‌లు పెరగడం, దానికితోడు వాళ్ళ నాన్న ప్రెస్ బాధ్యతలన్నీ మేనేజర్‌కి అప్పజెప్పటం ఆ మేనేజర్ ఇష్టారాజ్యంగా ప్రవర్తించి, లాభాల్లో నడుస్తున్న ప్రెస్‌ను స్వాధీనం చేసుకోవడంతో ఆ నమ్మకద్రోహాన్ని భరించలేక, వాళ్ళ నాన్న ఓ రోజు రాత్రి పూర్తిగా త్రాగి, తాగి ఆ నిద్రలోనే కన్నుమూయడంతో అశోక్ కుమార్ కుటుంబం పూర్తిగా రోడ్డున పడింది.

కుటుంబపోషణ, తమ్ముణ్ని, ఇద్దరు చెల్లెల్నీ చదివించడంకోసం అశోక్ కుమార్ అకస్మాత్తుగా చదువు మానేశాడు.

ఇది జరిగి అయిదేళ్ళయింది. ప్రస్తుతం అశోక్ కుమార్ ఓ పెట్రోల్‌బంక్‌లో మానేజర్‌గా వుంటున్నాడు.

“కార్లలో తప్ప రోడ్డుమీద కనబడని యువరాజువి ..... ఎవరో అనుకున్నాను ..... తీరా పలకరిస్తే నువ్వు ..... ” దగ్గరగా వస్తూ అన్నాడు అశోక్ కుమార్ -- ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ.

“నీ కారూ ..... నీ అంగరక్షకులు ఏర్రా .....ఎవరూ కనబడ్డంలేదు” మళ్ళీ అడిగాడు అశోక్ కుమార్. .

“ ఆ సైన్యమంతా ఇప్పుడు లేదుగానీ ..... ఇప్పుడెక్కడ ..... ఆ సిన్మాథియేటర్‌లోనేనా జాబ్ ..... ” అడిగాడు మధుకర్ .

“సిన్మాథియేటరా ..... ఆర్నెల్లయింది మానేసి ..... ఎన్ని ఉద్యోగాలు మానేస్తే అంత అనుభవం వస్తుందని మా బాబు చెపుతుండేవాడులే ..... ప్రస్తుతం నారాయణగూడా పెట్రోల్ బంక్‌లో ఉద్యోగం” నవ్వుతూ అన్నాడు అశోక్ కుమార్ .

“చెప్పు ..... నిన్నెప్పుడూ ఇలా సాదా మనిషిలా రోడ్డుమీద చూస్తానని అనుకోలేదురా ..... అసలేం జరిగిందో చెప్పరా ..... ” సానునయంగా అడిగాడు అశోక్ కుమార్ .

“నా ఆస్తి , అంతస్తూ అలాగే వుంది కానీ, కొన్ని కారణాలవల్ల, నేను నడిరోడ్డుమీదకు రావల్సి వచ్చిందిరా ..... వివరాలన్నీ ఎప్పుడయినా తీరిగ్గా చెప్తానుగానీ ..... నాకు ఉద్యోగం కావాలి-- ఏదయినా చూపించగలవా ..... ” అడగలేక అడగలేక అడిగాడు మధుకర్ .

“నీకుద్యోగమా?! ఎవరయినా పూర్ గర్ల్‌ని ప్రేమించి ! ఆ అమ్మాయికోసం, నీ ఆస్తిని త్యాగం చేసావా? మన పాత సిన్మాల్లో లాగా ..... ” అడిగాడు అశోక్ కుమార్ విస్తుపోతూ.

సర్వర్ రెండు టీలను తెచ్చి టేబిల్‌మీద పెట్టాడు-- చెరొకటీ తీసుకున్నారు.

“నాకుద్యోగం చూస్తావా, లేదా చెప్పు ..... ” అడిగాడు మధుకర్ ఒకింత సీరియస్‌గా .

“పెట్రోల్‌బంక్ మేనేజర్ అంటే రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్‌లా అదో పెద్ద ఉద్యోగం అనుకుంటున్నావా ఉద్యోగం చూడడానికి? ..... నేన్నీకు ఉద్యోగం చూసినట్టుగా మీ డాడీకి తెల్సిందే అనుకో మన పని సఫా ..... ”

“అలాంటిదేం జరగదు!”

“నిజంగా సీరియస్‌గా అడుగుతున్నావా ..... ”

“నిజం ..... పెట్రోల్‌బంక్‌లో బాయ్ ఉద్యోగమైనా సరే. నా కాళ్ళమీద నేను నిలబడాలి. అంతే ..... జీతమెంతైనా పర్వాలేదు.”